క్లుప్తంగా

పీఆర్ డిగ్రీ కళాశాలకు రాష్ట్ర స్థాయి అవార్డులు



ఉత్తమ రీసెర్చ్ అవార్డు అందుకుంటున్న హిందీ విభాగాధిపతి హరి రామప్రసాద్

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ నిర్వహించే విద్యా ఉత్సవం (ప్రజ్ఞ–2023) లో భాగంగా మూడు అవార్డులు కైవసం చేసుకుంది. ఈ ఏడాది అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల విభాగంలో అవార్డ్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, రాష్ట్ర ఉత్తమ రీసెర్చ్ అవార్డు కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ పసుపులేటి హరి రామప్రసాద్‌కు, ఉత్తమ స్కిల్స్ కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎస్.బుజ్జిబాబుకు అందజేశారు. కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్, జేఎన్‌టీయూ అనంతపురం వర్సిటీ వీసీ రంగా జనార్దన్ అవార్డులు అందజేశారు.

నేడు వైఎంసీఏ ఆధ్వర్యంలో క్రిస్మస్ పాటలు, క్విజ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): యంగ్ మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) కాకినాడ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం క్రిస్మస్ పాటలు, క్విజ్ పోటీలు (రాత రూపంలో) నిర్వహిస్తున్నట్లు శాఖ అధ్యక్షుడు హెన్రీ, కార్యదర్శి గాంధీ శనివారం తెలిపారు. స్థానిక రామారావు పేటలోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 30 ఏళ్ల లోపు వారు ఈ పోటీలకు అర్హులన్నారు. పాటల పోటీలు వ్యక్తిగత, గ్రూప్ విభాగంలో క్రిస్మస్ పాటలపై జరుగుతాయన్నారు. విజేతలకు ఈ నెల 28న సిటీ టేబర్నికల్ చర్చిలో జరిగే వైఎంసీఏ క్రిస్మస్ వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 95358 68625, 98484 03492 నెంబర్లులో సంప్రదించాలని కోరారు.

ఘనంగా విజయ్ దివస్



శ్రీనగేష్‌ను సత్కరిస్తున్న అడబాల తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయ్ దివస్ నిర్వహించారు. ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ మాట్లాడుతూ 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్తాన్‌పై భారతదేశం సాధించిన చారిత్రాత్మక సైనిక విజయాన్ని విజయ్ దివాస్‌గా జరుపుకుంటామన్నారు. 1971 డిసెంబర్ 3న భారత్‌పై పాకిస్తాన్ దాడి చేయగా 13 రోజుల పాటు సాగిన యుద్ధం డిసెంబర్ 16న ముగిసిందని తెలిపారు. ఆ యుద్ధ సమయంలో తాను కూడా పాలు పంచుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఆ సమయంలో దాదాపు 93 వేల మంది పాకిస్తాన్ సైనికులు లొంగిపోయారని అన్నారు. ఇది భారతదేశానికి గర్వకారణమైన క్షణమని అన్నారు. అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీనగేష్‌ను ఘనంగా సత్కరించారు. డాక్టర్ అద్దాల సత్యనారాయణ, న్యాయవాది యనమల రామం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

కరప: అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక దీక్ష శనివారం ఐదో రోజుకు చేరుకుంది. మండలపరిధిలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రూరల్ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.వీరవేణి, కరప ప్రాజెక్టు నాయకురాలు ఎస్.వరలక్ష్మి, సీఐటీయు మండల నాయకులు ఈ నిరసన కొనసాగించారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత

సామర్లకోట: విద్యార్థి దశ నుంచి ఇంధన వనరుల వినియోగంపై అవగాహన కలిగి పొదుపుగా వాడుకోవాలని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏపీఎస్‌డీఏస్ ప్రభాకరరావు అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యుత్ ఉపకరణాల వినియోగం, పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. 120 మంది విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. విజేతలకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ముగింపు సందర్భంగా 20న బహుమతులు అందజేయనున్నట్టు విద్యుత్ ఏడీఈ కె.రాంబాబు తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ పి.రమేష్‌కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కొత్తపల్లి: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పిఠాపురం పట్టణ పోలీసులు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...కోనసీమ జిల్లా మానేపల్లికి చెందిన రాయప్రోలు మౌనిక లక్ష్మీనర్సమాంబ పిఠాపురం తిమ్మరాజు వీధిలోని తన బంధువుల ఇంట్లో ఉంటోంది. ఈ నెల 12వ తేదీన పరీక్ష రాసేందుకు కాకినాడ వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై ఆమె తండ్రి రాయప్రోలు సాయిరామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిఠాపురం ఏఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా సమరాంగణ వేదిక కాకినాడ

- జనవరి 20 నుంచి 24 వరకు అండర్–19 జాతీయ టెన్నిస్ పోటీలు
- అందుబాటులో నాలుగు కోర్టులు
- చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- కోర్టులను పరిశీలించిన ఆర్జేడీ నాగమణి



జాతీయస్థాయి టెన్నిస్ పోటీల నిర్వహణకు డీఎస్‌ఏ కోర్టులను పరిశీలిస్తున్న ఆర్జేడీ నాగమణి తదితరులు (ఫైల్)

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలకు పదును పెట్టి వారిని మేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏటా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్–14, 17, 19 కేటగిరీల్లో విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు మండలస్థాయి, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో సాగనున్నాయి. అన్ని కేటగిరీల్లో దాదాపు 36 క్రీడల్లో ఈ పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో క్రీడోత్సాహాన్ని నింపుతున్నారు.

చాలా సంవత్సరాల తరువాత జాతీయ పాఠశాల క్రీడా సమాఖ్య కాకినాడకు అండర్–19 జాతీయస్థాయి టెన్నిస్ పోటీల నిర్వహణను కేటాయించింది. జనవరి 6 నుంచి 9 వరకు జరిగే ఈ పోటీలకు 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరుకానున్నారు. పోటీల నిర్వహణకు అనువైన సౌకర్యాలు ఉన్నాయా లేదా అని ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి కాకినాడ జిల్లా క్రీడా మైదానం, మున్సిపల్ టెన్నిస్ కోర్టులను, డీమార్టు వద్ద కోర్టులను, ఎస్పీ గ్రౌండ్స్‌లోని సింథటిక్ కోర్టులను పరిశీలించారు.

అలాగే వివిధ రాష్ట్రాల నుంచి హాజరవుతున్న క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యాలపై కూడా ఆమె సంబంధిత అధికారులతో చర్చించారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో పోటీల నిర్వహణకు చురుగ్గా పనులు జరుగుతున్నాయి. జాతీయ ప్రమాణాలతో కోర్టులను తీర్చిదిద్దుతున్నారు. చాలా సంవత్సరాల తరువాత జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో టెన్నిస్ పోటీలు జరుగుతుండడం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో క్రీడలకు పెద్ద పీట వేస్తూ పాఠశాల క్రీడా సమాఖ్య పోటీల నిర్వహణకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. దీంతో అధికారులు క్రీడాకారులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ భానుమూర్తి రాజు కాకినాడలోని టెన్నిస్ కోర్టులను పరిశీలించి సమాఖ్య కార్యదర్శి ప్రసాద్‌కు తగు సూచనలు సలహాలు అందించారు. జిల్లా క్రీడా మండలి, వైద్య, ఆరోగ్య, విద్య, రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో పోటీలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు కాకినాడ వాసులకు టెన్నిస్ పండుగ కనువిందు చేయనుంది.

16 ఏళ్ల తరువాత జిల్లాకు అవకాశం



పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో గతంలో 2007, 2008లో ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ జాతీయస్థాయి పోటీలు జిల్లాలో నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు జాతీయస్థాయి అండర్–19 పురుషుల టెన్నిస్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారుల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– ప్రసాద్, ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి



కాకినాడ డీమార్ట్ సమీపంలోని మున్సిపల్ సింథటిక్ కోర్టులు



జిల్లా క్రీడా మైదానంలోని సింథటిక్ కోర్టులు

యూపీఈఐఎఫ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న శేషారెడ్డి

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఉన్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాల విద్యార్థుల క్రికెట్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. స్థానిక ఆర్ఎంసీ క్రీడా మైదానంలో ఈ టోర్నీని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి ప్రారంభించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు ఇదయతుల్లా అధ్యక్షత వహించగా ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పూర్ణచంద్రరావు పోటీల నిర్వాహకులను అభినందించారు. పోటీలలో 22 జట్లు పాల్గొంటున్నాయని గీతం స్కూల్ కరస్పాండెంట్ సుజ్ఞాన్ తెలిపారు. అనంతరం శేషారెడ్డి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఎం.శ్రీవిజయ్, నారాయణ, సుబ్బిరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ గీత ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఎంపీ వంగా గీత ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బాలాత్రిపుర సుందరి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఎంపీ వెంట ఆమె కుమార్తె, అల్లుడు ఉన్నారు. వారికి ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం

- ఆర్జేడీ నాగమణి
- పెద్దాపురప్పాడులో విద్య, వైజ్ఞానిక ప్రదర్శన



ప్లాస్టిక్ వ్యర్థాల పర్యవసానాలను వివరించిన విద్యార్థులతో ఆర్జేడీ నాగమణి, ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

కరప: మండలం పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ(ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన మండలస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను ఆర్‌జేడీ డి.నాగమణితో కలసి జెడ్పీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి ప్రారంభించారు. విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం వలన విద్యార్థుల్లో దాగిఉన్న విజ్ఞానాన్ని వెలికి తీయవచ్చన్నారు. మండల పరిధిలో 9 ఉన్నత పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి స్టూడెంట్ ప్రాజెక్టు, టీచర్ ప్రాజెక్ట్, స్టూడెంట్ గ్రూపు ప్రాజెక్టు మూడు విభాగాలుగా ఈ ప్రదర్శన నిర్వహించారు. స్టూడెంట్ విభాగంలో వేళంగి(ఎకో ఫ్రెండ్లీ), కరప (ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్), పెద్దాపురప్పాడు(ట్రిగ్నోమెట్రిక్ విల్లాస్) మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నాయి. గ్రూపు ప్రాజెక్టులో గురజనాపల్లి, కూరాడ, అరట్లకట్ట హైస్కూళ్లు, టీచర్ ప్రాజెక్టులో వేళంగి, పెద్దాపురప్పాడు, వేములవాడ హైస్కూళ్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉప సర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పెంకే సత్తిబాబు, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, హెచ్‌ఎం ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ కె.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాకలపూడిలో ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి హైస్కూల్‌లో మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఫెయిర్) ఆకట్టుకుంది. విద్యాశాఖ, కోరమండల్ ఇంటర్నేషనల్ సహకారంతో శనివారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ మండలంలోని 18 ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటేలా వైజ్ఞానిక అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి ఎంఈవో ఎల్.గణేష్ బాబు అధ్యక్షత వహించారు. కోరమండల్ యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలను తిలకించి బహుమతులు అందజేశారు. ప్రదర్శనలో భాగంగా పి.వెంకటాపురం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలోను, ఏపీఎస్పీ స్కూల్ విద్యార్థులు రెండో స్థానంలోను, వాకలపూడి హైస్కూల్ విద్యార్థులు మూడో స్థానంలోను నిలిచారు. వీరికి అతిథులు బహుమతులను అందజేశారు. హెచ్‌ఎంలు మూర్తి, శేఖర్, వాకలపూడి హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ భవానీ, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ కరీం బాషా, కోరమండల్ సిబ్బంది వంశీ తదితరులు పాల్గొన్నారు.



వాకలపూడి హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్‌లో ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



ఉపాధ్యాయులకు జ్ఞాపిక అందజేస్తున్న కోరమండల్ హెడ్ శ్రీనివాసరావు తదితరులు



పెద్దాపురప్పాడు ఉన్నత పాఠశాలలో సాంకేతిక మూలకాలను వివరించిన విద్యార్థులతో ఆర్జేడీ

గ్రామాల్లో ధనుర్మాసం సందడి



కరప విష్ణాలయంలోని శ్రీవేణుగోపాలస్వామి

కరప: నెలగంట మోగింది. గ్రామాల్లో సంక్రాంతి సందడి ప్రారంభమైంది. ధనుర్మాసం రాకను స్వాగతిస్తూ ప్రతి ఇంటా నేటి నుంచి ముత్యాల ముగ్గులు కొలువు తీరనున్నాయి. మండలంలో కరప, జెడ్.భావారం, కూరాడ, పెనుగుదురు, చినమామిడాడ, గ్రామాల్లో విష్ణాలయాలు, యండమూరు, కరప, పెనుగుదురు, కూరాడ గ్రామాల్లో వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఈ నెల్లాళ్లు ప్రత్యేక పూజలు చేస్తారని అర్చకులు అనంతాచార్యులు తెలిపారు. ధనుర్మాసం నెలరోజులు వేణుగోపాలస్వామికి తెల్లవారుజామునే పూజా కార్యక్రమాలు నిర్వహించి, నైవేద్యం సమర్పిస్తామన్నారు. ఆయా ఆలయాల్లో ధనుర్మాస పూజలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు, దేవదాయశాఖాధికారులు తెలిపారు.

23న వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు



ధనుర్మాస ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ నెల 23న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ జంపన రమణయ్యరాజు తెలిపారు. స్థానిక గాంధీనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ధనుర్మాసం ఉత్సవాల ఏర్పాట్లపై ఈఓ సీహెచ్ఎస్ఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు క్యూలైన్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో ప్రతి రోజు ఉదయం సుప్రభాతం, అర్చన, తిరుప్పావై సేవాకాలం నిర్వహించనున్నట్లు చెప్పారు. వైకుంఠ ఏకాదశి రోజున స్వామి వారి ఉత్తరద్వార దర్శనం కల్పిస్తామన్నారు. జనవరి 14న ఆలయంలో గోదా వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్ కాశీ అన్నపూర్ణ, జి వీరవేణి, కె.రాంబాబు, కేవీఎల్ నరసింహారావు, ఆలయ అర్చకులు పి. రామకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

విప్లవ చైతన్యమూర్తి బోయి భీమన్న



బోయి భీమన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సుబ్బారావు తదితరులు

కాకినాడ రూరల్: సాంఘిక దురాచారాలను నిర్మూలించడానికి బోయి భీమన్న విశేష కృషి చేశారని మండల ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఎం.సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక బోట్‌క్లబ్ ఉద్యానవనంలో బోయి భీమన్న విగ్రహం వద్ద ఆయన వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ అక్షరాలే ఆయుధంగా జీవించిన సాహితీ వేత్త బోయి భీమన్న అన్నారు. ఆయన రాసిన పాలేరు, కూలి రాజు, గుడిసెలు తగలబడుతున్నాయి వంటి నాటకాలు మన రాష్ట్రంలో సంచలనం కలిగించాయని అన్నారు. భాష, కవిత్వం పట్ల ఆయనకు స్పష్టమైన ఆధునిక అభిప్రాయాలు ఉండేవని అన్నారు. సృజనాత్మక రచనలతో పాటు గొప్ప విమర్శకుడు అని పేర్కొన్నారు. ఆయన ఎంత గొప్ప మానవతావాదో అంత గొప్ప హేతువాది అని, నీ మనసే–నీ దైవం, నీ ప్రజ్ఞ–నీ ప్రగతి, నీవే–నీ సుఖసంతోషాలకు కర్తవు అని భీమన్న ఉపదేశించారని సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ఎస్ శ్రీనగేష్ తదితర వాకర్లు పాల్గొన్నారు.

మహిళలకు దుస్తుల పంపిణీ



కొవ్వాడలో మహిళలకు చీరలు పంపిణీ చేసిన కార్యకర్తలు

కాకినాడ రూరల్: మండలంలోని కొవ్వాడ గ్రామంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పుట్టినరోజును పురస్కరించుకుని పెద్ద ఎత్తున చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కె.రవి ఆధ్వర్యంలో అంబేద్కర్ యువజన సంఘం, బాబు జగ్జీవన్‌రామ్ యువజన సంఘం సంయుక్తంగా చీరలు పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పుట్టిన రోజును పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

జీఏఎంసీ సేవలను సద్వినియోగం చేసుకోండి

పెద్దాపురం: నిరుపేదలకు సేవలందిస్తున్న గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ చర్చెస్ అండ్ మినిస్ట్రీస్ (జీఏఎంసీ) ట్రస్టు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు చైర్మన్ శ్రీమంతుల చక్రవర్తి అన్నారు. మండలంలోని ఆనూరు గ్రామంలో శనివారం స్థానిక అరుంధతీపేట వాసులకు రగ్గులు, దుప్పట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జార్జి శ్రీమంతుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో చక్రవర్తి మాట్లాడుతూ పేదలకు అండగా జీఏఎంసీ సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం సుమారు 250 మంది పేదలకు దుప్పట్లు, రగ్గులను పంపిణీ చేశారు. పైడిమళ్ల నాగరాజు, మల్లయ్య, వల్లూరి సూర్యారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ వినియోగదారుల దినోత్సవాలు

కాకినాడ సిటీ: ఈనెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సోమవారం నుంచి 24వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండల, రెవెన్యూ డివిజినల్ అధికారుల కార్యాలయాల్లో సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహిస్తున్నట్లు పౌర సరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వినియోగదారుల క్లబ్బులు వలంటీర్ల ఆర్గనైజేషన్ సభ్యులు సంబంధిత రెవెన్యూ కార్యాలయాల్లో హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా స్థాయిలో ఈ–కామర్స్, డిజిటల్ వర్తకం శకంలో వినియోగదారుల రక్షణ అంశంపై హైస్కూల్, కాలేజీ స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి, ప్రిన్సిపాల్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ కాలేజీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి వచ్చిన వారిని 24న విజయవాడలో నిర్వహించే జాతీయ వినియోగదారుల దినోత్సవం రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్టు తెలిపారు.

మేధస్సు వెలికితీతకు వైజ్ఞానిక ప్రదర్శనలు



విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు తిలకిస్తున్న దొరబాబు

పెద్దాపురం: విద్యార్థుల మేధస్సును వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక పద్మనాభ కాలనీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఎంఈఓ ప్రభాకర శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ సైన్స్ పట్ల విద్యార్థులు మరింత మక్కువ అలవర్చుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా మాట్లాడుతూ విద్యలో రాణించినప్పుడే ప్రతి విద్యార్థికీ మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం దొరబాబు సైన్స్‌ఫేర్‌ను ప్రారంభించి విద్యార్థుల ప్రదర్శనలు తిలకించారు. కౌన్సిలర్లు పెంటకోట సత్తిబాబు, విడదాసరి రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, నిందితుడితో ఎస్ఈబీ పోలీసులు

తాళ్లరేవు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు శనివారం నిర్వహించిన వేర్వేరు దాడుల్లో 75 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. తాళ్లరేవు ఎస్ఈబీ సీఐ జేవీ భవాని తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా తుమ్మలపాలెం గ్రామానికి చెందిన కంచర్ల నాగరాజు కారులో మద్యం సీసాలను తరలిస్తుండగా తాళ్లరేవు బైపాస్ రహదారిలో దాడి చేసి పట్టుకున్నారు. నాగరాజును అరెస్ట్ చేసి కారు, 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామానికి చెందిన వాతాడి మంగ విక్రయించేందుకు తీసుకెళుతున్న 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్ట్ చేశారు. దాడిలో ఎస్ఈబీ ఎస్ఐ ఎంవీవీబీ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.